కథానిక :

చిరునవ్వు

రచయిత : డి. హెచ్. లారెన్సు

అనువాదం : శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

ఒకరకమైన తపస్సుగా ఆ రాత్రి అంతా అతను జాగరణ చేయాలనుకున్నాడు. టెలిగ్రాంలో ముక్తసరిగా "ఒఫీలియా స్థితి ప్రమాదకరం" అని మాత్రమే ఉంది. ఆ పరిస్థితులలో తాను రైల్లో సుఖంగా నిద్ర పోవటం అతనికి పరిహాసాస్పదంగా తోచింది. అందుకని అలసటగా ఆవలిస్తూ అలాగే ఆ మొదటి తరగతి పెట్టెలో కూచున్నాడు. క్రమంగా రాత్రి గడిచి పోతోంది. రైలు ముందుకు సాగిపోతోంది.

నిజానికి అతనప్పుడు ఒఫీలియా ప్రక్కన ఉండవలసింది. అయితే ఒఫీలియా సంఘటనను వాంఛించలేదు. అందుచేతనే ఇప్పుడతను రైల్లో ఉండటం తటస్థించింది.

అతనిలో లోలోపల ఎక్కడో ఒక నల్లని బరువైన వాపు-విచారం కరడుగట్టి ఏర్పడినవాపు- అతని జీవశక్తుల నన్నిటినీ బలంగా క్రిందికి గుంజుతున్నట్టనిపిస్తోంది. అతని నల్లని, నున్నని అందమైన ముఖమూ, ఒత్తుగా పెరిగిన నల్లని కనుబొమ్మలూ, విస్పష్టంగా కనిపించే ప్రగాఢమైన ఒక అనుభూతీ, సిలువమీద క్రీస్తుని జ్ఞాపకం చేస్తున్నై.

రైల్లో ఒక రాత్రి గడపటంకన్నా నరకం లేదు. ఏదీనిజంగా అనిపించదు. అతని ఎదురుగా కూచుని ఉన్న ఇద్దరు స్త్రీలూ...... చాలా కాలం క్రితమే - బహుశా అతని కంటె కూడా పూర్వమే-జీవించారు. నిజానికి అతడూ స్వయంగా అంతే.

గోధుమవన్నె వేకువ దూరాన కొండల్లో మెల్లగా తల ఎత్తుతోంది. ఎక్కడో చూస్తున్న కళ్లతో అతడా వేకువను పరికిస్తున్నాడు. అతని మనస్సులో చటుక్కున ఒక గీతం స్ఫురణకు వచ్చింది.

"మంచు మునుగుల మధ్య వెల్లెడ
మసకమసకగ ప్రొద్దు పొడిచెను
తనువు చాలించినది సుందరి
తల్పి భారమునక !"

నిశితంగా ఆలోచించి చూచుకోగా అతనిలో అకస్మాత్తుగా ఏదో గొప్పతనం పొడసూపుతూన్నట్టనిపించి తనమీద తనకే ఎనలేని ఏవగింపు కలిగింది. ఏ కదలికా లేని అతని వైరాగి ముఖంలో మాత్రం ఆ ఏవగింపు చిన్నె ఏమాత్రం కనిపించలేదు.

పీఠభూమి గుండా రైలు పోతోంది. ఏ అనుభూతికీ మనస్సు తట్టుకునే స్థితిలో లేదు. మైళ్ల తరబడి చెట్టూచేమా లేక కాలి పోయిన నేల లాగ పరుచుకుని పోయి ఉన్న పీఠభూమి ప్రదేశాన్ని చూస్తూ కూచున్నాడు.

గమ్యస్థానమైన...పట్టణం...చేరుకునే సరికి మళ్లీ ప్రొద్దుక్రుంకింది. ప్రస్తుతం ఒఫీలియా ఉంటూన్న "బ్లూసిస్టర్సు" భవనం ముందు టాక్సీ దిగి చరచరా మదర్ సుపీరియర్ ఉండే గదిలోకి వెళ్లాడు. ఆమె లేచి మౌనంగా నమస్కరించి, చూపును పొడుగాటి ముక్కు మీదుగా అతని వైపు పారిస్తూ, ఇలా అంది:

"ఏమని చెప్పటానికీ నాకు నోరు రావటం లేదు...మధ్యాహ్నమే అంతా అయిపోయింది."

అతను చైతన్యం కరడుగట్టుకొని పోయినవాని లాగ నుంచున్నాడు. ఏ అనుభూతీ లేదు. అందమైన వైరాగిముఖంతో శూన్యంలోకి చూస్తున్నాడు.

ఆమె మృదువుగా తన తెల్లని అందమైన చేతితో అతని చెయ్యిపట్టుకుని ముఖంలోకి చూస్తూ ఉంది: "ఏం చేస్తాం!...ధైర్యం తెచ్చుకోవాలి!"

అతను ఒక అడుగు వెనక్కి వేశాడు. పరాయి స్త్రీతో అంత సన్నిహితంగా నుంచుని మాట్లాడటమంటే అతనికి తగని భయం! జీరాడే పల్చని దుస్తుల ధరించి ఉన్న ఆమెలో స్త్రీత్వం తొణికిసలాడుతోంది.

అతను జవాబు చెప్పాడు: "ఔను. ధైర్యం కాక ముందిలెండి!...నే నిప్పుడామెను చూడవచ్చునా?"

ఆమె ఒక గంట మోగించింది. క్షణంలో ఒక సిస్టరు ప్రత్యక్షమైంది. ఒక్క పల్చని మనిషి యువతి. సోగ తేరిన కళ్లలో ఒక విధమైన చిలిపితనం తొంగి చూస్తోంది.

పెద్దామె వినపడీ వినపడకుండా మొక్కుబడి చెల్లించుకున్నట్టు అతన్ని ఆమెకి పరిచయం చేసింది. అతివినయంగా వంగి ఆమె అతనికి నమస్కరించింది. ప్రవాహంలో కొట్టుకు పోతూ గట్టుపరకకోసం చెయ్యి చాపినట్టు అతను ఆమె కరచాలనంకోసం చెయ్యి చాపాడు. బిడియపడుతూ ఆ యువతి నిద్రించే తెల్లనిపావురాయి లాంటి తన చెయ్యి అతనిచేతి కందించింది.

దుఃఖంతో బరువెక్కి ఉన్న అతని హృదయంలో అట్టడుగున ఎక్కడో ఒక ఊహ మెరిసింది: "ఎంత మృదువైన చెయ్యి!"

వాళ్లు ఒక చక్కని వరండా గుండా నడిచి వెళ్లి, ఒక చోట ఆగి తలుపు తట్టారు. అతను ఏదో లోకంలో ఉన్నట్టు నడుస్తున్నప్పటికీ, అతని ముందుగా నడుస్తున్న ఆ యువతి పాదాల మీద చిత్రంగా కదలాడే జరీ అంచునీ, మృదువుగా ధ్వనిచేసే నల్లని జీరాడే దుస్తుల్నీ గమనిస్తూనే ఉన్నాడు.

తలుపు తెరుచుకోగానే అతను అదిరి పడ్డాడు. క్రొత్తగా వెల్ల వేసిన ఆ విశాలమైన గదిలో ఒక ప్రక్కగా భార్యశవం...చుట్టూ దీపారాధనలూ...శవం ప్రక్కన ఒక సిస్టరు కూచుని ఉంది. ఆమె మదరు సుపీరియరు అంతగాని, చిన్న సిస్టరు అంతగాని తెలుపు కాదు. అమాయికమైన ముఖం. కొంచెం స్థూలకాయం. వీళ్లని చూడగానే పారాయణ చేస్తున్న బైబిలు గ్రంథం మూసి లేచినుంచుంది. కొంచెంగా వంగి నమస్కారం చేసింది. రొమ్ములమీది నీలపు పట్టు దుస్తులలోపల దాగి తావళం త్రిప్పుతున్న ఆమె చామన చాయ చేతిని అతను గమనిస్తూనే ఉన్నాడు.

స్త్రీత్వం తొణికిసలాడుతున్న ఆ ముగ్గురు సిస్టర్లూ నిశ్శబ్దంగా శవం తలాపి దిక్కుకి వెళ్లి నుంచున్నారు. పెద్దామె ముందుకు వంగి అతి సుకుమారంగా శవం ముఖం మీది వస్త్రం తొలగించింది.

భార్య అందమైన మృతవదనమూ, దానిలో విస్పష్టంగా కనిపించే ఒక ప్రశాంతీ చూడగానే అతని అంతరాంతరాలలో ఎక్కడో చిత్రంగా ఒక నవ్వు బయలు దేరింది. సన్నగా దగ్గాడు. ఒక అసాధారణమైన మందహాసచ్ఛాయ ముఖం మీద ప్రసరించింది. గాలికి ఊగే మందార మొగ్గల్లాగ కదులుచున్న ఆ దీపాలవెలుతురులో ఆ ముగ్గురు సిస్టర్లూ అతి జాలిగా అతనికేసి చూస్తున్నారు. ఆ చూపులు అద్దాల లాగ స్వచ్ఛంగా ఉన్నై. ఆ ఆరు కళ్ళలోనూ ఒక్కసారిగా ఒక విధమైన భయం ఆరంభమైంది. ఆభయం అల్లా కొంతసేపు అటూ ఇటూ తటపటాయించి క్రమంగా ఆశ్చర్యంగా మారింది. నిస్సహాయంగా ఆ దీపాల వెలుతురులో అతని ముఖం చూస్తున్న ఆ ముగ్గురు సిస్టర్ల ముఖాల్లోకూడా ఒక చిత్రమైన అనుద్దిష్టమైన మందహాసం వ్యక్తమైంది. ముగ్గురి ముఖాల్లోనూ ఒకే తొడిమను వికసిస్తున్న మూడుపువ్వుల్లాగ ఒకే నవ్వు వేరువేరు పద్ధతుల్లో వ్యాపిస్తోంది. ఒక్క పల్చని మూడవ సిస్టరు విషయంలో ఆ నవ్వు ఒక విధమైన తీవ్రమైన బాధతో సమ్మిళితమైంది. శవం కాపలాలో ఉన్న చామన చాయ సిస్టరు ఆరిందా ముఖంలో ఒకరమైన ఆటిక నాస్తికుని నవ్వు విస్ఫురించింది.

ఆ యువకని ముఖం లాగానే విశాలమైన ముఖం గల పెద్ద సిస్టరు ఏమైనా సరే నవ్వకూడదని గట్టి ప్రయత్నం చేసింది. కాని, నవ్వుతో నిండుగా మెలిగొరిగిన ముఖం ఎత్తి అతను ఆమె వైపే చూస్తున్నాడు. ఆమె శక్తికి మించి క్రమక్రమంగా ఆమె ముఖం కూడా నవ్వు అలముకుంది ఆమె తల వంచుకుంది.

బక్క పల్చని మూడవ సిస్టరు ఉన్నట్టుండి హఠాత్తుగా ముఖం కప్పుకుంది. ఆమె ఒళ్ళంతా వణకటం మొదలు పెట్టింది. పెద్ద సిస్టరు మృదువుగా ఆమె భుజం మీద చెయ్యి వేసి "వెర్రి పిల్లా! ఏడుస్తున్నావా?" అంది జాలిగా. ఆ జాలివెనక మంద హాసచ్ఛాయ కూడా ఆమెముఖంలో అలాగే నిలిచి ఉంది. స్థూలకాయురాలైన చామనచాయ సిస్టరు తావళం త్రిప్పుతూ అలాగే నుంచుంది. ఏమీ మార్పు లేదు ముఖంమీద నీరసమైన ఆ మందహాసం నిశ్చలంగా అలాగే వేలాడుతోంది.

తన ప్రవర్తన అంతా మృత భార్య గమనిస్తున్నదేమో అన్న ఊహ తోచి అతను హఠాత్తుగా శవం వేపు తిరిగాడు. ఆ తిరగటంలో భయం విస్పష్టంగా కనిపిస్తోంది.

శవానికి వికృతాకారం ఏర్పడలేదు. చనిపోయి బిగుసుకు పోయినా కోతేరు పెట్టినట్టున్న అందమైన ముక్కు, ముఖంలో శిశుసహజమైన మంకు పట్టు - అంతలోనూ కడసారి మంకు పట్టు - యొక్క ముద్రా ..చాలా దర్శనీయంగానే ఉంది ముఖం. అతని ముఖంలో ఒక్కసారిగా మందహాసం అదృశ్యమై పోయింది. దాని స్థానంలో హింసింపబడుతున్న యాగపశువుయొక్క దృష్టి వెలిసింది. అతను ఏడవలేదు. అలాగే అర్థంలేకుండా చూస్తున్నాడు. ఆ యాగపశువుదృష్టి క్రమక్రమంగా బాగా వ్యక్తమవుతోంది. ఇలా అనుకున్నాడు: "ఈ యాగపశువుతనం ఒకనాడు నాకు సంక్రమించ నున్నదని నాకు ఎన్నడో తెలుసు"

పదేళ్ళైంది వాళ్ళ వివాహమై. తాను సర్వవిధాలా సాక్షీ గా ప్రవర్తించాడా? లేదు. లేదు. ఏవిధంగా చూసినా తాను సాక్షీ అయినవాడు కాదు. అయితే ఆమె ఎప్పుడూ తన మాటే నెగ్గాలనేది. ఆమె అతన్ని ప్రేమించింది. ఏదో ఒక మంకు పట్టు పట్టి, అతన్ని ఏవగించుకునో, కోపగించుకునో అక్కడికి డజనుసార్లు ఆమె అతన్ని వదిలిపెట్టి వెళ్లిపోవటం, డజనుసార్లు మళ్లీ తిరిగి రావటం జరిగింది.

వారికి సంతానం లేదు. సహజంగా అతనికి సంతాన వాంఛ ఉంది. సంతానం కలుగక పోయెనే అని ఎంతో దుఃఖపడేవాడు.

ఇప్పుడు ఇంక ఆమె అతని దగ్గిరికి తిరిగి రాదు. ఇది పదమూడోసారి. ఈసారి ఆమె శాశ్వతంగా అతని దగ్గిర్నించి వెళ్లి పోయింది.

నిజంగా ఆమె వెళ్లి పోయిందా? ఈ మాట అనుకునేటప్పటికి ఆమె అతన్ని నవ్వించాలని పక్కటెముకల్లో చక్కిలిగింత పెడుతున్నట్టనిపించింది. అతనిలో కొంచెం కదలిక ఏర్పడింది. కాని అంతలో కోపంతో అతని కనుబొమ్మలు ముడిపడినై. ఏమైనా సరే నవ్వకూడదు. పళ్లుగట్టిగా నొక్కి పట్టాడు.

తన మట్టుకు తాను సాక్షీ అయినవాడు కాదు. తన లోపాలన్నీ ఏకరువు పెట్టుకోవాలని మొదట పెట్టాడు.

అంతలో హఠాత్తుగా అతను ఆ ముగ్గురు సిస్టర్ల వేపు తిరిగాడు. కొంచెం దూరంలో ముగ్గురూ వరుసగా నుంచుని ఉన్నారు. తనకీ శూన్యానికీ మధ్య నాజూకుదుస్తుల్లో ఒయ్యారంగా కదలాడుతున్న ఆ మూడు స్వరూపాలనూ అతను చూశాడు. ఒక్కసారిగా అతని కళ్లు మెరిసినై. పళ్లు గట్టిగా బిగబట్టి వేశాడు.

బిగబట్టిన గొంతుతో అన్నాడు. "మొదటినించీ నేను లోపాలే చేశాను."

"ఏమిటి అంటున్నారు?" అంటూ పెద్ద సిస్టరు ముందుకు వచ్చింది. ఆ రావటంలో అంతవరకూ ముడుచుకుని ఉన్న ఆమె చేతులు విడివడి పైకి వెళ్లి మళ్ళీగూటికి చేరుకుంటూన్న పక్షి దంపతుల్లాగ వచ్చి కలుసుకున్నై.

అతను చిరాకుగా చుట్టూ చూశాడు. తూలి తూలి పోతున్నాడు. పెద్ద సిస్టరు, ఒక తత్త్వం అందుకుంది. ఆమె రొమ్ములమీది ముత్యాల హారం చిక్కు పడింది. మూడో బక్కపల్చని సిస్టరు ఇంకా దూరంగా వెళ్ళినుంచుంది. స్థూలకాయురాలైన రెండో ఆమె నల్లని కళ్ళు శాశ్వతములైన నక్షత్రాల్లాగ తళతళా మెరుస్తూ అతని వేపు చూస్తున్నై. మళ్ళీ పక్కటెముకల్లో నవ్వు కెరటం లేస్తున్నట్లైంది.

"ఇలా చూడండి! నాకు ఒంట్లో ఎలాగో ఉంది నేను వెళ్లి వస్తాను" అన్నాడు అతను.

ఏమి అనటానికీ తోచక వాళ్ళు తటపటాయించి ఊరుకున్నారు. అతను తూలుతూ తూలుతూ గుమ్మంవేపు నడిచాడు. వెళ్లి పోయేటప్పుడు లావుపాటి సిస్టరు నల్లని కళ్ళలోని శాశ్వతమైన తళతళకి ఫలితంగా అతని ముఖంలో మళ్ళీ చిరునవ్వు ప్రాకింది. రహస్యంగా అతనిలో ఒక ఊహ వదిలింది: పక్షిదంపతుల్లాగ కలిసి ఉన్న ఆమె మునిమాపు వన్నె చేతుల్ని రెంటినీ తన చేతుల్లో గాఢంగా అదుముకోగలిగితే ఎంత బావుండును!

తన లోపాలను గురించే ఆలోచించాలని మళ్ళీ మొదలు పెట్టాడు. తనలో అన్నీ లోపాలే! తనను తనే ఏవగించుకున్నాడు. ఆ ఏవగించుకుంటున్నప్పుడుకూడా "నవ్వు" "నవ్వు" అని పక్కటెముకల్లో ఏవో తొలుస్తున్నట్టే అనిపిస్తోంది.

ఆ విశాలమైన గదిలో ఆ విధంగా మిగిలి పోయిన ఆ ముగ్గురు సిస్టర్లూ ఒకళ్ల మొహం ఒకళ్ళు చూసుకున్నారు. పచ్చని చెట్టుమీద నించి ఒక్కసారిగా పైకెగిరి పోయిన ఆరుపక్షుల్లాగవారి చేతులు పైకిలేచినై. వారు భగవత్ప్రార్థన చేశారు.

"పాపం!" అంది పెద్దామె జాలిగా.

"ఔను పాపం కాకేముంది?" అంది బిగ్గరగా, ఆవేశంగా మూడో సిస్టరు.

"నిజమే!" అంది ముక్తసరిగా నల్ల కళ్ళ సిస్టరు.

నిశ్శబ్దంగా పెద్ద సిస్టరు శవందగ్గిరికి వెళ్లి ముఖం మీదికి వంగి చూస్తూ, అంది: "ఇలా చూడండి. ఈ జీవుడు సర్వం గమనిస్తూనే ఉంది."

మూడు తలలూ ముందుకి వంగి శవంముఖాన్ని పరిశీలిస్తున్నై. మొదటి సారిగా వారికి ఆశవం పెదవుల దగ్గిర చిత్రమైన అర్థయుక్తమైన ఒక మెలిక కనిపించింది. రెట్టించిన ఆశ్చర్యంతో వాళ్ళు చూస్తున్నారు.

అరిపేద గుండె గల మూడో సిస్టరు అంది: "తృప్తుకుండా ఈమె తన భర్తని చూసుకుంది."

పెద్ద సిస్టరు అతి జాగ్రత్తగా మళ్ళీ శవం ముఖంమీద గుడ్డ కప్పివేసింది. అనంతరం ముగ్గురూ తావళాలు త్రిప్పుతూ ప్రార్థనచేశారు.

మళ్ళీ చామన చాయ సిస్టరు బైబిలు గ్రంథం ముందు వేసుకుని కూచుంది. తక్కిన ఇద్దరూ మెల్లగా గుమ్మందాటి వరండా గుండా వెళ్లి పోతున్నారు. నదిమీద ఈదులాడుతూ పోతున్న రాజహంసల్లాగ వెల్లవేసిన వరండా గుండా సాగిపోతున్న వారు హఠాత్తుగా ఒక చోట ఆగారు. దూరంగా ఆ వరండా చివర వెర్రిగా తిరుగుతున్న ఒక నిర్భాగ్య పురుషుని స్వరూపాన్ని వారు చూశారు. పెద్ద సిస్టరు అంతలో నడక జోరు చేసింది.

అతను వీళ్లిద్దరూ తనవైపు రావటంగమనించాడు. మూడో సిస్టరు కొంచెం వెనక పడింది.

"క్షమించండి...ఎక్కడోగాని నేను నా టోపీ మరచి పోయాను" అన్నాడు అతిగాభరాగా అతను.

అని ఒక్క ఊపుతో వెనక్కి తిరిగి చరచరా నడుస్తూ బయటకు వెళ్ళి పోయాడు. అంతకన్న మందహాస శూన్యమైన ముఖాన్ని ఎన్నడూ ఎవ్వరూ చూచి ఉండరు.!!

నారసింహలేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిశ్శక్తి, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తుల డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. కంపెని. పెరిదేపి-నెల్లూరు జిల్లా

బ్రాంచి : 7 పీసుమొదలి వీధి, మద్రాసు.